# పులితోలు

వీరభద్రరావ్ పట్మి

రాజీవ్ గాంధీ చనిపోయాడని ఆఫీసులకి శెలవులి చ్చారు. హైదరాబాద్‌లో దుకాణాలన్నీ మూసేశారు. నగరంలో జరిగిన అల్లర్ల కారణంగా పోలీసు గస్తీ ము మ్మరం చేశారు. నగరమంతా యుద్ధానంతర ప్రశాంతి నెలకొని వుంది.

వెంకటేష్‌కి అశాంతిగా వుంది. చిరాకుగా వుంది. ఊపిరి సలపనట్టుగా వుంది. అతనో గవర్నమెంటాఫీసు లో పనిచేస్తాడు. జీతం కాకుండా కాస్త పైరాబడి ఉం టుంది. రోజూ ఆఫీసు అయిపోయాక ఆఫీసు క్లబ్బులో పేకాడటం, వారానికి రెండుమూడు సార్లు స్నేహితులతో కలిసి బార్లకి వెళ్ళడంఅతనికున్న చిన్న సరదాలు.

పెళ్ళయిన కొత్తలో ఈ అలవాట్లు మాన్పించాలని అత ని భార్య చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఆవిడ విసుగెత్తి ఊరుకుంది. వెంకటేష్ రెండు రోజులుగా ఇం



ట్లోనే ఉన్నాడు. ఆఫీసు లేదు, క్లబ్ లేదు, బారుల్లేవు.

సాయంత్రం ఆరైంది. అతను బట్టలు వేసుకుని కాసేపుఅలా తిరిగొస్తానని భార్యకి చెప్పి బైటకి వెళ్ళిపో యాడు. అతను మెల్లిగా నడుచుకుంటూ రెడ్డి ఇంటికి వె ళ్ళాడు. రెడ్డి వెంకటేష్ ఒకే ఆఫీసులో పనిచేస్తారు. ఇ ద్దరూ మంచి స్నేహితులు. ముఖ్యంగా క్లబ్ పక్షులు. పేకాటలో డబ్బులు వచ్చినప్పుడు ఒకరికొకరు పార్టీ ఇ చ్చుకుంటుంటారు.

"నిన్నంతా కనబళ్ళేదు. ఏమైపోయావ్?" రెడ్డి వెంక టేష్‌ని అడిగాడు.

"ఇంట్లోనే ఉన్నా. బోర్ కొట్టి చచ్చిపోయాననుకో" ఇద్దరూ కాసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నారు.

"చాలా చిరాగ్గా ఉంది. పేకాట లేదు. మందు లేదు. " వెంకటేష్ అన్నాడు.

"జేబులో డబ్బుంటే చెప్పు. వెళ్ళి మందు తెచ్చుకుం దాం"

"రాజీవ్‌గాంధీ పోయాడని షాపులన్నీ కట్టేశారు. ఇప్పు డు మందెక్కడ దొరుకుతుంది?" వెంకటేష్ అమాయకంగా అడిగా డు.

"డబ్బులుండాలేగాని- ఇండి యాలో ఎపుడేనా ఏదైనా దొరుకు తుంది. ఇందిరాగాంధీ పోయి నప్పుడే మందు దొరికింది"

"సరే అయితే సంచి తీసుకురా" వెంకటేష్ అన్నాడు.

రెడ్డి బట్టలేసుకుని సంచి తీసుకుని బైటకి వచ్చాడు. ఇ ద్దరూ చింతలబస్తీ నుంచి మెయి న్‌రోడ్డు మీదకి వచ్చి ఖైరతాబాద్ గేటు దాటి పక్క సందులోంచి బాగా లోపలికి వెళ్ళారు. అక్కడో ఇంటి ముందు ఆగారు. లోప ల్నించి ఓ కుర్రాడు బైటకి వచ్చి "ఏంటి?" అనడిగాడు.

"విస్కీ కావాలి- మెక్‌డవెల్" రెడ్డి చెప్పాడు.

కుర్రాడు రెండు నిముషాల్లో పేపర్లో కట్టిన బాటిల్ అందించా డు.

వెంకటేష్ డబ్బిచ్చాడు. రెడ్డి బా టిల్ సంచిలో పెట్టుకున్నాడు.

ఇద్దరూ రెడ్డి ఇంటి వైపు న డకసాగించారు.

***

రెడ్డి ఇంట్లో వీధి వైపుకి ఉన్న గదిలో కుర్చీలు, టీపాయ్ అ మర్చుకున్నారు. గ్లాసులు నింపుకున్నారు. ఇద్దరూ మొదటి సిప్ చేసారు.

"నిన్నట్నుంచీ సత్తిరాజు కనబ ళ్ళేదు. ఏమయ్యాడో?" రెడ్డి అడిగాడు.

"నాకూ కనబళ్ళేదు." వెంకటేష్ అన్నాడు.

"నా పేరు సత్తిరాజు- తండ్రి రామరాజు- తాత గోపా లరాజు " సరిగ్గా అదే క్షణంలో సత్తిరాజు అక్కడ ప్రత్యక్ష మయ్యాడు. రెండు నిముషాల్లో అతనూ గ్లాసుతో సిద్ధం అయ్యాడు.

"దేశం ఇంత విపత్కర, విచిత్ర పరిస్థితుల్లో వుంటే మందు సంపాదించిన మహానుభావుడికి నమస్కారం" సత్తిరాజు గ్లాసు ఎత్తి ఛీర్స్ చెప్పాడు.

"మన రెడ్డి అసాధ్యుడు- అయినా పంటి సిరి వున్నవా డివి." వెంకటేష్ అన్నాడు.

"పంటి సిరి కాదు- గొంతు సిరి"

సత్తిరాజు మాటలకు మిగిలిన ఇద్దరూ ఫక్కున న వ్వారు. పార్టీ పూర్తయ్యేసరికి రాత్రి ఎనిమిదిన్నర అయిం ది.

అసలే మే నెల. దానికి తగ్గట్టు వేడి పదార్థం లోపల పడేసరికి ఉక్కగా చిరాగ్గా వుంది.

"కాసేపు పేకాట వేద్దామా?" అన్నాడు రెడ్డి.

"వెయ్యాలనే వుంది. రెండు రోజుల్నుంచి చేతులు చ చ్చుపడిపోయాయి. కాని వేడికి ఉక్కగా చిరాగ్గా వుంది" అన్నాడు వెంకటేష్.

"బైట అరుగా మీద వేసుకోవచ్చు." సత్తిరాజు సూ చాడు.

రెడ్డి ఉంటున్నది పూర్వకాలపు ఇల్లు. అందులో నా లుగు పోర్షన్లున్నాయి. ఆ ఇల్లు అంత బావుండదు. సా ధారణంగా తక్కువ జీతగాళ్ళు అలాంటి ఇళ్ళలో ఉం టారు.

"ఓ పని చేద్దాం. అరుగు మీద వేద్దాం. ఎలాగూ వీధి దీపం ఉంది. కాస్త చల్లగాలి తగులుతుంది." అన్నాడు స త్తిరాజు.

ఓ అరగంట ఆట నడిచింది. ముగ్గురూ ఆటలో ని మగ్నమైపోయారు. సడెన్‌గా-

ఓ జీప్ వచ్చి ఆ ఇంటి ముందాగింది. ముగ్గురూ అ టుకేసి చూసారు. జీప్ లోంచి ఓ సబిన్‌స్పెక్టరూ, న లుగురు కానిస్టేబుళ్ళు దిగారు.

"ఏయ్- ఏంటిది? పబ్లిగ్గా పేకాడుతున్నారు?" ఎస్. ఐ. సహజమైన గద్దింపు ధోరణిలో అడిగాడు.

ముగ్గురూ పేకలు కింద పడేసారు. వాళ్ళకి ఆ షాక్ లోంచి తేరుకోడానికి రెండు నిముషాలు పట్టింది.

"ఇది మా ఇల్లే సార్. ఏం తోచక..." రెడ్డి సంజాయి చెప్పబోయాడు.

"మీ ఇల్లయితే మాత్రం- పబ్లిగ్గా కూర్చుని పేకాడ తారా? నడవండి స్టేషన్‌కి"అని గద్దించాడు.

ముగ్గురూ ఎస్.ఐ.ని బతిమాలారు. గవర్నమెం టాఫీసులో పనిచేస్తున్నామని, ఇంతకు ముందెప్పుడూ ఇలాంటి వెధవపని చెయ్యలేదనీ, ఇక ముందెన్నడూ చె య్యమని కొంచెం దయ, కొంచెం కరుణ చూపమనీ కోరారు. ఎస్.ఐ. ఒప్పుకోలేదు.

"ఊరంతా గొడవ గొడవగా ఉంటే మేమసలే శాంతి భద్రతలు కాపాడలేక ఛస్తుంటే మీరీ రకంగా న్యూసెన్సు క్రియేట్ చేస్తారా?" అని గద్దించాడు.

"చదువుకుని ఉద్యోగం చేస్తున్న వాళ్ళు ఇలా వెధవల్లా ప్రవర్తించడానికి మీకేవన్నా సిగ్గుందా?" అనడిగాడు.

అనరాని మాట్లన్నీ అన్నాడు. వెంకటేష్, రెడ్డి ఎస్.ఐ. తో మాట్లాడుతుంటే సత్తిరాజు ఓ కానిస్టేబుల్‌ని పక్కకి తీసుకెళ్ళి బేరం మొదలెట్టాడు.

"తలో వందా సమర్పించుకుంటాం- వదిలేయండి" అని బతిమాలాడు. కానిస్టేబుల్‌కి అలాంటి పరిస్థితి ఇష్ట మేగాని అతనక్కడ నిర్ణయం తీసుకునే స్థితిలో లేడు.

"ఈ ఎస్.ఐ. కొత్త రిక్రూట్. కొత్త బిచ్చగాడు పొద్దెరగ డని- డూటీ- డూటీ అని సంపేత్తన్నాడు. పైగా నీతిగా బతకాలంటాడు. లంచాలు పుచ్చుకోకుండా బతకాలంటే ఈ ఎదవ పనికిమాలిన ముదనష్టపు పోలీసుజ్జోగం ఎందుకూ?"

ఈ మాటలన్నీ కానిస్టేబుల్ సత్తిరాజుతో అనలేదు గానీ మనసులో గాఢంగా అనుకున్నాడు. అతను ఇంటికెళ్ళి మూడురోజులైంది. స్నానం చేసి రెండు రోజులైంది.

అతను చాలా చిరాకుగాను, అసహనంగాను ఉన్నాడు.

"సార్! ఈయన 'తలో వంద ఇస్తాను. వదిలెయ్యండి'- అంటున్నాడు" అన్నాడు కానిస్టేబుల్ ఎస్.ఐ.తో.

అతని మాటల్లో వెటకారం వుంది. వ్యంగ్యం వుంది.

"మనలాంటి నీతిమంతులకి లంచం ఇస్తున్నాడు" అనే ధోరణి వుంది.

ఎస్.ఐ. కోపంగా చూసాడు.

"నేలేకపోతే నువ్వెలాగూ అలాంటి వెధవ పని చేసేవాడివి. నాకు తెలుసు" అన్నాడు ఎస్.ఐ. కానిస్టేబుల్‌తో.

కానిస్టేబుల్ కొంచెం సిగ్గు, కొంచెం అవమానం ఫీలయ్యాడు. కానీ ఆ ఉద్యోగంలో అలా ఫీలయ్యే అవకాశం లేదని అతనికి తెలుసు.

"ఇదిగో! మీ రిద్దరూ వీళ్ళని పోలీసు స్టేషన్‌కి తీసికెళ్ళండి. మేం అలా రౌండ్ కొట్టి వస్తాం.మీరు కక్కుర్తిపడి వీళ్ళని వదిలేస్తే మాత్రం ఊరుకోను. ముందే చెప్తున్నాను." ఇద్దరు కానిస్టేబుళ్ళని అక్కడ వదిలేసి మిగిలిన ఇద్దర్నీ జీపులో ఎక్కించుకుని ఎస్.ఐ. వెళ్ళిపోయాడు. స్టేషన్‌కి వెళ్ళడం తప్పదని ముగ్గురికీ తెలిసిపోయింది. అప్పటికి రెడ్డి లుంగీ బనీనుతో ఉన్నాడు. బట్టలు మార్చుకోవడానికి అతను లోపలికి వెళ్ళాడు. వెంకటేష్, సత్తిరాజు మిగిలిన ఇద్దరు కానిస్టేబుళ్ళు అరుగుమీద కూర్చున్నారు.

"ఏంటయ్యా- మీ ఎస్.ఐ. మరీ చిత్రంగా ఉన్నాడు. మేమేవన్నా మర్డర్ చేసామా? మానభంగం చేసామా? ఆఫీసు లేదుకదాని సరదాగా పేకాడుకుంటున్నాం. పైగా డబ్బిస్తాన చెప్పాకదా" సత్తిరాజు నిష్ఠూరంగా కానిస్టేబుల్‌తో అన్నాడు.

"అయ్యా గురూజీ! ఏం చెప్పమంటారు. మా బాధ? ఆడికైతే పెళ్ళాం పిల్లలు లేరు. ఇరవై నాలుగ్గంటలూ డ్యూటీ చేయిస్తన్నాడు. రెండేళ్ళలో డి.జి.యో, కమీషనరో అయిపోదామనుకుంటున్నట్టున్నాడు. ఈడు మా స్టేషన్నుంచి ట్రాన్స్‌ఫరైపోతే మా స్టేషన్లో కానిస్టేబుళ్ళంతా మూకుమ్మడిగా గుండుకొట్టించుకుంటారు....

నడవండి, నడవండి. మళ్ళీ ఆడొచ్చే సరికి స్టేషన్లో లేకపోతే 'కాపరాలు చెయ్యడానికి పోయారా' అని అరుస్తాడు. రాత్రి పగలూఆడితోటే సరిపోతాంది. ఆడితోటే కాపురం- ఇంక మాకు పెళ్ళాలు అనవసరం."

కానిస్టేబుల్ కడుపులో మంట బైటకి కక్కాడు. రెడ్డి బట్టలేసుకుని రాగానే అయిదుగురు పోలీసుస్టేషన్ వైపు బైల్దారారు.రెడ్డి, వెంకటేష్‌కి భయం ఆందోళన లాంటివి లేవుగాని సత్తిరాజు మాత్రం లోపల కొంచెం భయపడుతున్నాడు.రెడ్డి, వెంకటేష్ పూర్వం ఓసారి సుల్తాన్ బజార్లో ఓ ఫ్రెండు రూంలో పేకాడుతూ పోలీసులకి పట్టుబడి తలో ఏభై సమర్పించుకుని బైటపడ్డారు.

సత్తిరాజుకి అలాంటి అనుభవం లేదు.కబుర్లు చెప్పుకుంటూ అంతా కలిసి శ్యాంటాకీస్ సెంటర్ దాకా వెళ్ళారు.

"మీ ఎస్.ఐ. రావడానికి ఇంకా టైం పడుతుంది కదా- చాయ్ తాగి పోదాం" అన్నాడు రెడ్డి.

కానిస్టేబుళ్ళు ముందు తటపటాయించారు గానీ తర్వాత సరే నన్నారు.అంతా కలిసి హోటల్‌కి వెళ్ళారు. ఆ మాటా ఈ మాటా మాట్లాడుకున్నారు. ఎలా బైట పడాలో చెప్పమని ముగ్గురూ కానిస్టేబుళ్ళని అడిగారు.

"స్టేషన్‌కి వెడదాం. సర్కిల్ సార్ ఉంటే మీ విషయం చెప్తాను. తప్పయిపోయింది. ఇంకెపుడూ ఇలా చెయ్యం-అని బతిమాలుకోండి.మిమ్మల్ని వెళ్లిపోమ్మంటాడు. ఆ తర్వాత ఎస్.ఐ.వస్తే సర్కిల్ సార్ పంపేసారని చెప్తాను." ఓ కానిస్టేబుల్ చెప్పాడు.

అతను చెప్పిన పరిష్కారం అందరికీ నచ్చింది.సత్తిరాజు కానిస్టేబుల్లిద్దరికీ చెరో ఏభై చేతిలో పెట్టాడు.

" అప్పుడే ఎందుకు? ముందు పని కానివ్వండి." అన్నాడు కానిస్టేబుల్. ఫరవాలేదు, తీసుకోమని బతిమాలారు. వాళ్లు తీసుకోమన్నారు.



"ఇంతకీ మీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎవరూ?" రెడ్డి అడిగాడు.

"ఆయన పేరు- కిష్టయ్య- చాలా మంచోడు." కానిస్టేబుల్ చెప్పాడు.

రెడ్డికి బుర్రలో బల్బు వెలిగింది.

"కిష్టయ్యంటే నల్లగా ఎత్తుగా ఆరడుగుల ఎత్తుంటాడు అతనేనా?"రెడ్డి అడిగాడు.

"నీకు తెలుసా?" సత్తిరాజు ప్రశ్నించాడు.

"అతను పూర్వం మనాఫీసులో పనిచేసాడు. అప్పటికి మీరిద్దరూ ఆఫీసులో చేరలేదు. మేమిద్దరం ఒకే సెక్షన్‌లో పనిచేసాం. అతనికి ఎస్.ఐ.గా సెలక్షన్ వచ్చినప్పుడు సెక్షన్‌లో పార్టీ ఇచ్చాం. అతను నాకు బాగా తెలుసు.

అసలతనికి ఎస్.ఐ. సెలక్షన్ వచ్చినప్పుడు వెళ్ళనా వద్దా అని తటపటాయిస్తుంటే- వెళ్ళిపోవయ్యా- ఈ ఆఫీసులో ఏముందీ దిబ్బ- అని ఎంకరేజ్ చేసి పంపించాను. ముందు వరంగల్ జిల్లా వేసారు. తర్వాత హైదరాబాద్ ట్రాన్స్ఫరై వచ్చాడని ఎవరో చెప్పారు. కాని నేను అతన్ని కలవలేదు. అతనే అయితే సమస్యే లేదు. పది నిముషాల్లో బైట పడిపోవచ్చు." అన్నాడు రెడ్డి.

"పదండి బాబూ పోదాం" అన్నాడో కానిస్టేబుల్.

అంతా కలిసి పోలీస్‌స్టేషన్‌కి చేరుకున్నారు.

పోలీస్‌స్టేషన్ ఉన్నది చిన్న బిల్డింగ్‌లో. మెట్లు ఎక్కి తలుపు తీసుకుని లోపలకెడితే సర్కిల్ ఇనస్పెక్టర్ కూర్చునే గది వస్తుంది. బిల్డింగ్ పక్కగా పెద్ద గుమ్మం వుంది. అందులోంచి లోపలకెడితే ఓ వేపచెట్టు వుంది. చెట్టుకి చెరోపక్కన రెండు చిన్న చిన్న బిల్డింగ్‌లు వున్నాయి. అక్కణ్నుంచి కూడా సి.ఐ. గదికి దారి వుంది.

ముగ్గుర్నీ చెట్టు దగ్గర ఉండమని చెప్పి కానిస్టేబుళ్ళిద్దరూ పక్క బిల్డింగ్‌లోకి వెళ్ళారు.అయిదు నిముషాల తర్వాత బైటికి వచ్చి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉన్న గదివైపు తొంగి చూసారు. వెనక్కి వచ్చి రెడ్డితో "సార్ ఉన్నాడు. ఎవరితోనో మాట్లాడుతున్నాడు. ఆళ్ళు ఎళ్ళిపోగానే మీ విషయం చెప్తాను" అన్నాడు.

సత్తిరాజుకి లోపల వణుకు ప్రారంభమైంది. రెడ్డి మాత్రం చాలా ధీమాగా వున్నాడు. వెంకటేష్ తనకేం పట్టనట్టుగా చెట్టుకింద బాసింపట్టు వేసుకుని కూర్చున్నాడు.

"తాగిందంతా దిగిపోయింది. మళ్ళీ మందెయ్యాలి " అన్నాడు వెంకటేష్.

"ఈ గోల అయిపోనీ- ఇంకా మిగిలింది కదా- వేసేద్దాం" అన్నాడు రెడ్డి.

పది నిముషాల తర్వాత కానిస్టేబుళ్ళు సి.ఐ. గదిలోకి వెళ్ళి రెండు నిముషాల్లో బైటికి వచ్చి " మీ గురించి చెప్పాం. సార్ కొంచెం కోపంగా ఉన్నాడు. కాస్త జాగ్రత్తగా మాట్లాడండి" అని పక్కకి తప్పుకున్నారు.

ముందు రెడ్డి వెనకాల సత్తిరాజు, వెంకటేష్ సి.ఐ. గదిలోకి వెళ్ళారు.

దాదాపు ఇరవై సంవత్సరాల తర్వాత రెడ్డి కృష్ణయ్యని చూసాడు. యూనిఫాంలో చాలా హుందాగా, పోలీసాఫీసర్‌కి ఉండాల్సిన ఠీవితో ఉన్నాడు. మొహంలో వయస్సు తెచ్చిన అలుపు, డూ్యటీవల్ల కలిగిన సొలుపు కనిపిస్తున్నాయి.

చెవులపైన జుట్టు కాస్త నెరసింది.

"ఏం క్రిష్ణయ్య బావున్నావా? ఎన్నాళ్ళైంది నిన్ను చూసి..." రెడ్డి మాటల్లో సహజమైన ఆనందం, స్వచ్ఛమైన ఉత్సాహం ఉన్నాయి.

కృష్ణయ్య కళ్ళెత్తి రెడ్డి కేసి చూసాడు.

అతని భృకుటి ముడి పడింది.

కోపం మొహంలోకి, కళ్ళలోకి, నుదుటిమీదికి తన్నుకొచ్చింది. అతను పాము బుసకొడుతున్నట్టుగా లేచాడు.

"ఎవడ్రా నువ్వు - దొంగలం.... నన్ను పేరు పెట్టి పిలుస్తావు. గవర్నమెంటాఫీసులో పనిచేస్తున్నారు. బుద్ధిలేదూ. మందు కొట్టి రోడ్ మీద పేకాడతారా? పైగా స్టేషన్ కొచ్చి నా హోదా మరిచిపోయి నన్ను పేరుతో పిలుస్తావా? నేనేవన్నా నీ మేనత్త కొడుకుననుకున్నావా? నీ హద్దు నీకు తెలియక్కర్లేదా? వుండాకోర్ ముండాకొడుకా!

ఒరేయ్- నువ్వు క్రిమినల్‌వి. నేను నిన్ను శిక్షించే అధికారం వున్న పోలీసాఫీసర్ని...

ఓ పక్క సిటీఅంతా గోలగోలగా వుండి మేం ఛస్తుంటే మీరు రోడ్ మీద పేకాడతార్రా? మళ్ళీ ఇలాంటి వెధవ పని

చేసినట్టు తెలిస్తే గుడ్డలూడదీసి కొట్టిస్తాను. పొండవ తలికి." గుక్క తిప్పుకోకుండా తిట్టాడు.

రెడ్డి మ్రాన్పడిపోయాడు.

ముగ్గురికీ మాటలేదు.

బిక్కచచ్చిపోయి బైటికి వచ్చి రోడ్ మీద పడిపోయారు. ఇంటికి నడక సాగించారు.

తను ఏం తప్పు మాట్లాడాడో ఎంత ఆలోచించినా రెడ్డికి అర్థం కాలేదు.

ముగ్గురూ మౌనంగా రెడ్డి ఇంటికి వెళ్ళి సీసాలో మిగిలింది తాగేసారు. వెంకటేష్, సత్తిరాజు తమ ఇళ్ళకి వెళ్ళిపోయారు.

అంత తాగినా రెడ్డికి ఆ రాత్రి నిద్ర పట్టలేదు.

కృష్ణయ్య మాటలు గుండెల్లో భగ్గున మండుతున్నాయి. మెదడులో ముళ్ళలా గుచ్చుకుంటున్నాయి.

***

మర్నాడుదయం ఎనిమిది గంటలకి...

ఇంటి ముందు జీప్ ఆగిన చప్పుడైతే రెడ్డి కిటికీ లోంచి బైటికి చూసాడు.

అతని గుండె గుభేల్‌మంది.

పై ప్రాణాలు పైకి పోయాయి.

అతనికి జీప్ దిగి తన గుమ్మంలోకి వస్తున్న కృష్ణయ్య కనిపించాడు. వాళ్ళని పోలీస్‌స్టేషన్‌కి తీసికెళ్ళిన ఎస్.ఐ. జీప్ పక్కనే నిలబడి ఉన్నాడు.

మళ్ళీ ఏం కొంప మునుగుతుందోనని భయపడుతూ రెడ్డి బైటికివచ్చాడు.

**పోలీస్ యూనిఫామ్ వున్నంతసేపూ అతను మనిషి కాదు, పులితోలు కప్పుకున్న మృగం.**

"హలో రెడ్డీ- ఏవిటిలా ఆశ్చర్యపోతున్నావు? నిన్ను చూసివెడదామని వచ్చానయ్యా." అన్నాడు కృష్ణయ్య.

ఏవీ అర్థంగాక రెడ్డి కృష్ణయ్యని ఇంట్లోకి తీసికెళ్ళాడు.

రెడ్డి తన భార్యని పిల్లల్ని కృష్ణయ్యకి పరిచయం చేసాడు. రెడ్డి భార్య కూతురి చేత కాఫీ పంపింది.

"సారీ రెడ్డీ. నిన్న రాత్రి అలా మాట్లాడాను. నాకు నిజంగా బాధగా ఉంది. నిన్న రాత్రి నాకు నిద్ర పట్టలేదు. జరిగిన దానికి సిగ్గుపడుతున్నాను.

ఆ దరిద్రపు యూనిఫాంలో ఏదో ఉంది. అది వేసుకుని ఆ కుర్చీలో కూర్చున్నా, లాఠీ చేత్తో పట్టుకున్నా మనిషినే మారిపోతాను. మనసు రాయిలా, మెదడు ముళ్ళకంపలా, నోరు బూతుల బుంగలా అయిపోతుంది. ఎంతగా నన్ను నేను అదుపులో పెట్టుకుందామన్నా కుదరలేదు.

చిన్న తప్పు చేసిన మనిషిక్కూడా పెద్ద శిక్ష వేయాలనిపిస్తుంది. ఎంత తప్పు చేస్తున్నానో, ఎంత పాపం మూటగట్టుకుంటున్నానో నాకు తెలుసు. అయినా ఏవీ చెయ్యలేని అశక్తత.

బహుశా రాత్రి పగలు నేరస్తులతో సంచరిస్తున్నందువల్ల అనుకుంటాను. ఇలా మృగంలా మారిపోయాను.

జరిగిన దానికి క్షమించు.

ఇప్పుడు మీ ఇల్లు తెలిసింది కదా... మనసు బాగా లేనప్పుడు నీ దగ్గరికి వచ్చి కూర్చుంటాను. కాసేపు పులితోలు విప్పేసి మనిషిలా నీతో మాట్లాడతాను." అని లేచి చరచరా బైటికి వెళ్ళి జీపు ఎక్కాడు కృష్ణయ్య.

రెడ్డి మనసులో క్షమ కదిలింది. ■

# కంప్యూటర్ మాయగాళ్లు

మామూలు మనుషులనేగాక అన్నీ తెలిసినవారినిసైతం ఆరితేరిన దొంగలు మోసం చేయడం ఇప్పుడు సర్వసాధారణ విషయం. మనిషి తన అవసరాల మేరకు మేధాశక్తిని పెంచుకుంటూ కంప్యూటర్ల వరకు ప్రగతిని సాధించగా, ఆధునిక చోరాగ్రేసరులుకూడా అదేమేరకు, అదే దోవలో నడుస్తూ చివరకు ఆ కంప్యూటర్లనే మోసం చేసే దశకు చేరుకున్నారు. ఇది ఇవాల్టిదో, నిన్నటిదో మాటకాదు. 1970 వ దశకానికి ముందే కంప్యూటర్ ఫ్రాడ్స్ ప్రపంచవ్యాప్తమై వివిధ దేశాల రక్షణ, నిఘా విభాగాలవారిని ముప్పుతిప్పలు పెట్టిన దాఖలాలున్నాయి. కాలానికి అనుగుణంగా మానవుల అదుకంటే, కంప్యూటర్‌ల మిస్టేక్‌లకు ఆధారాలుండవు కనుక, అందుకు శిక్షలు వేసే చట్టాలుకూడా లేవుగనుక. కంప్యూటర్ మోసాలకు గురయ్యే వివిధ కంపెనీలవారు జరిగిన దోపిడీని గురించి అటు పోలీసులకు ఫిర్యాదు చేయలేక, ఇటు కప్పిపుచ్చుకోనూలేక విపరీతమైన చికాకును అనుభవిస్తుంటారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న కంప్యూటర్‌మోసాల్లో కేవలం ఓ పదిశాతం మాత్రమే పోలీసుల దర్యాప్తుకు అందుతున్నాయేగానీ మిగతావన్నీ నిస్సహాయస్థితిలోనే మగ్గుతున్నాయి. బ్రిటన్‌లో 100 మిలియన్ పౌండ్ల పరిశ్రమగా కంప్యూటర్ పరిశ్రమ అభివృద్ధి చెందిన దశలోనే కంప్యూటర్ మోసాల కేసుల్ని దర్యాప్తు చేసి లోతుపాతుల్ని బయటపెట్టటానికి స్కాట్లాండ్ యార్డ్ డిటెక్టివ్‌లు 50 మందికి పైగా పనిచే

**మనిషి తప్పుచేస్తే 'ఎందుకు చేశావు?' అంటూ అతనిని నిలేయగలం. అతనినుండి అసలు కారణాన్ని, యధార్థ స్థితిని రాబట్టగలం. కానీ, సాంకేతిక పరంగా రారాజంతటి కంప్యూటర్ల చేతే కావాలని పొరపాట్లు చేయిస్తే వాటినుండి సమాధానాలు రాబట్టగల నిఘా ఇంజనీర్లు ఎక్కడ?**

## నేరం

వసరాలను తీరుస్తున్న కంప్యూటర్లనే ఛీట్ చేసి ప్రపంచ అగ్రస్థాయి నేరస్తులు, మోసగాళ్ల జాబితాలో చేరిపోయిన వారి కథలు ఆశ్చర్యకరంగా వున్నాయి.

కంప్యూటర్లు ఒక దశలో మానవుడి వైజ్ఞానిక విజయంగా భావిస్తున్న రోజులు అవి. మనిషి తప్పుచేస్తే 'ఎందుకు చేశావు?' అంటూ అతనిని నిలేయగలం. అతనినుండి అసలు కారణాన్ని, యధార్థ స్థితిని రాబట్టగలం. కానీ, సాంకేతిక పరంగా రారాజంతటి కంప్యూటర్లే పొరపాట్లు చేస్తే వాటినుండి సమాధానాలు రాబట్టగల నిఘా ఇంజనీర్లు ఎక్కడ?-'ఎందుకు తప్పు చేశావు? ఎక్కడ జరిగింది లోపం? ఎవరు దీనికి మూలకారకులు?'అన్న ప్రశ్నలకు అవి జవాబులు చెప్పలేని నిస్సహాయ స్థితిలో వుంటాయి. 'మనిషి మనిషే'-'యంత్రం యంత్రమే' అన్న గుణపాఠానికి తార్కాణంగా కంప్యూటర్ మోసాలను పేర్కొనవచ్చు. ఓ ఘోర తప్పిదానికో లేక భారీ కుంభకోణానికో 'కంప్యూటర్ మిస్టేక్' అని వివరణ ఇచ్చి తప్పుకుంటే ఇంక మరో ప్రశ్నకు, జవాబుకు ఆస్కారమే వుండదు. ప్రాణంలేని ఈ కంప్యూటర్ల నిస్సహాయతనాన్ని ఆసరాగా చేసుకుని కొందరు సాంకేతిక నిపుణులే దొంగలుగా అవతారం దాల్చి కంప్యూటర్ మోసాలకు పాల్పడడం పరిపాటి అయింది. కేవలం ఒక్క అమెరికాలోనే 1963 నుండి 1969మధ్యకాలంలో కంప్యూటర్‌ల ద్వారా మాయలు చేసి ఒక మిలియన్ డాలర్లను సంపాయించుకున్నచోరశిఖామణి వున్నాడంటే కంప్యూటర్లను ఎలా తప్పుదారి పట్టించి వైజ్ఞానిక సంపదను దుర్వినియోగపరుస్తున్నారో అర్థమవుతుంది. కంప్యూటర్లు ఎంత తెలివిగలవో తమ పరిధిలోకి రాని విషయాల్లో అవి అంతే తెలివితక్కువవి కూడా! పొరపాటును కప్పిపుచ్చుకోలేకపోయామో జరిగిన దోపిడీని పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశమూ వుండదు. ఎంశారు. కంప్యూటర్ల సాయంతో జరిగే నేరాల ప్రమాదాలను ఎదుర్కొనే కంపెనీలకు సలహాలివ్వడానికిగాను ఇద్దరు బ్రిటీష్ కంప్యూటర్ నిపుణులు తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేసి ఒక సలహా కంపెనీనే ఏర్పాటు చేశారు. "కనురెప్ప పాటు కాలమైనా పట్టని అతితక్కువ కాలంలోనే కంప్యూటర్ మోసాలు చోటు చేసుకుంటాయి." అని వారు చెబుతారు. ఒక కంపెనీ నుండి 25,000 పౌండ్లు, మరో కంపెనీనుండి 75,000 పౌండ్లు సంగ్రహించిన ఒక కంప్యూటర్ సెంటర్ అధిపతిని వీరు వెలుగులోకి తెచ్చారు.

కంప్యూటర్లద్వారా జరిగే అన్ని మోసాల్లోనూ స్పష్టత వుండదు. ఒక కంప్యూటర్ ప్రోగ్రామరే తన కంప్యూటర్‌ను తప్పుదారి పట్టించి ఉచిత సేవింగ్ కూపన్‌లను [illegible] సాయంతో సంపాయించుకున్నాడు. తర్వాత అతను ఆ కూపన్లను గిఫ్టులుగా మార్చుకున్నాడు. ఇలాంటి జిమ్మిక్కులు, ఎత్తులు, జిత్తులు అమెరికాలో పేర్గాంచిన కంప్యూటర్ మాయగాళ్లకు ఒక లెక్కలోకి రావు. అక్కడ మాయదారి కంప్యూటర్ దొంగలు లక్ష పౌండ్ల విలువ చేసే ప్రగతి దాయక కంప్యూటర్ పరిశ్రమను ఆసరాగా చేసుకుని దోచుకుంటున్నారు.

అ[illegible]కు చెందిన ఒక బ్యాంకులో జరిగిన కంప్యూటర్ మోసం దర్యాప్తు[illegible] అంచనాలకైనా అందకుండా పోయింది. అక్కడ [illegible] బ్యాంకులో 10 డాలర్లలోపు అకౌంట్లకు 10 [illegible]ంట్లు, 10 డాలర్లపైన అకౌంట్లకు 1 డాలర్ సర్వీస్ ఛార్జీగా కలపాల్సివుంది. అయితేఓ ఉద్యోగి 'జ్వికే' అనే కొత్త అజ్ఞాత వ్యక్తి పేరుమీద దొంగఅకౌంటు తెరచినట్టు కంప్యూటర్‌లో చూపి ఆ అకౌంటుపై సర్వీసు ఛార్జీని క్రెడిట్ చేయసాగాడు. అయితే, చిత్రంగా 'మొదటి, చివరి కస్టమర్లకు బ్యాంకు గిఫ్టులు ఇవ్వబోతోందని' ప్రకటించడంతో 'జెడ్' అక్షరంతో మొదలయ్యే ఈ 'జ్వికే' పేరున నడుస్తున్న అకౌంటుబాగోతం బయటప